క్లుప్తంగా

జగనన్న ఇళ్లు వేగవంతం



నిర్మాణాలు పరిశీలిస్తున్న సర్పంచ్‌లు, అధికారులు

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లి, శకునాలపల్లె గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను శుక్రవారం హౌసింగ్ ఏఈ రామకృష్ణ, జేసీఎస్ అధ్యక్షుడు కల్లూరి కృష్ణారెడ్డి, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు కల్లూరి శ్యామలాదేవి, కల్లూరి వెంకటేశ్వరరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తిచేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇసుక, సిమెంట్ సరఫరా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు కరీముల్లా, తేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతగా సీసీ రోడ్లు



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని అప్పారావుపాళెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా అప్పారావుపాళెం సచివాలయానికి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెమ్మసాని శ్రీనివాసులునాయుడు, చంద్రా హజరత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని 3వ వార్డులో అంతర్గత సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య ప్రారంభించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో సచివాలయం నిధులు వెచ్చించి వార్డుల్లో అంతర్గత సిమెంట్ రోడ్డు పనులు జరుగుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ గౌస్‌బాషా, పార్టీ నాయకులు షేక్ రిజ్వాన్, నలిశెట్టి శీనయ్య, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమి పరిశీలన



శ్మశాన వాటిక కార్యక్రమాలు నిషేధిస్తూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

ఉదయగిరి: పట్టణంలోని ఆనకట్ట ప్రాంతంలో శవాలు పూడ్చి పెట్టడం నిషేధించాలని కోరుతూ సోమవారం కొంత మంది స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక వీఆర్వో వెంకట్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమగ్ర నివేదిక తహసీల్దార్‌కు అందజేశారు. స్థానికులు వీఆర్వోతో మాట్లాడుతూ నివాస ప్రాంతాలకు ఆనుకుని ఉన్న ప్రదేశంలో ఇలాంటివి చేయకూడదని అధికారులు బోర్డు పెట్టినప్పటికీ కొందరు ఉద్దేశ పూర్వకంగా వ్యవహరిస్తున్నారని, భవిష్యత్‌లో ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫ్లెక్సీల ఏర్పాటులో తమ్ముళ్ల రగడ

- కాకర్ల ఫ్లెక్సీల లారీలను అడ్డుకున్న బొల్లినేని వర్గం



లారీలను అడ్డుకున్న బొల్లినేని వర్గం

కొండాపురం: ఉదయగిరి నియోజకవర్గంలో ఈ నెల 11 నుంచి లోకేష్ యువగళం పాదయాత్ర కొనసాగనున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం టీడీపీ నేత కాకర్ల సురేష్ కొండాపురం మండలంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు ఆయన వర్గానికి చెందిన బొట్లగుంట హరిబాబు మరి కొందరు టీడీపీ నాయకులు ఫ్లెక్సీల లారీలతో కొండాపురం చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న బొల్లినేని వర్గానికి చెందిన తెలుగు రైతు అధ్యక్షుడు రమేష్, మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకార్, మరి కొందరు లారీలను అడ్డుకున్నారు. ఉదయగిరి టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని రామారావుకు తెలియకుండా ఫ్లెక్సీలు ఎలా ఏర్పాటు చేస్తారని, బొల్లినేని ఆదేశాలతోనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటూ సుమారు గంట సేపు అడ్డుకున్నారు విషయం తెలుసుకున్న ఎస్సై ఖాజావలి ఇరు వర్గాల మధ్య సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించడంతో సర్దుమణిగారు. ఫ్లెక్సీల ఏర్పాటుపై పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది.

ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- రూ.7 లక్షలతో సైడుకాలువల నిర్మాణానికి శంకుస్థాపన



లబ్ధిదారులకు అందిన లబ్ధిని తెలుపుతూ బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని, ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సంగం బిట్-2 సచివాలయం పరిధిలో రెండో రోజు శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేకు సంగం వైఎస్సార్‌సీపీ నేతలు కంటాబత్తిన రఘునాథరెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి ఘన స్వాగతం పలికారు. స్థానిక వికాస్ పాఠశాల నుంచి ప్రతి ఇంటికి తిరుగుతూ అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేశారు. మండల పరిషత్ నిధులు రూ.7 లక్షలతో నిర్మించిన సైడు కాలువల నిర్మాణాలకు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇచ్చినట్లుగా నెరవేర్చిన ముఖ్యమంత్రి దేశంలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం పూర్తి చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో మరోసారి ప్రజానీకమంతా ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్న విషయం ప్రజల ముఖాల్లో వెల్లివిరుస్తున్న ఆనందాన్ని బట్టి తెలుస్తోందన్నారు.

లే అవుట్‌లో గృహ నిర్మాణాల పరిశీలన

సంగంలోని తిరుమనతిప్ప, ఐటీఐ కళాశాల ప్రాంగణం సమీపంలో జగనన్న కాలనీల లే అవుట్లలో జరుగుతున్న గృహ నిర్మాణాలను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరిశీలించారు. 2, 3 లేఅవుట్లలో జరుగుతున్న జగనన్న కాలనీల నిర్మాణ పరిస్థితులను గురించి గృహ నిర్మాణశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని, నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సంగం కొత్తూరులో ఇటీవల డయాలసిస్ చికిత్స పొందుతూ మృతి చెందిన సురేష్ కుటుంబానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంగం కొత్తూరు వద్దకు వచ్చే సరికే సురేష్ భార్య కుమారి కుటుంబ పెద్దను కోల్పోయామని, ఇంటర్మీడియట్ చదివే కుమార్తె ఉందని కన్నీరు పెట్టుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రూ.30 వేలు చెక్‌ను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రావులలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు దేవసహాయం, మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముడి మల్లికార్జునరెడ్డి, బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మహిళా నాయకురాలు నయీమున్నిసా, వేణు, సర్పంచ్‌లు ప్రసాద్ రెడ్డి, చందన్ కుమార్, కరిముల్లా, శంకరయ్య, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై టీడీపీ దాష్టీకం

- 1500 మందికి ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకుంటూ కోర్టుల్లో కేసులు
- అభివృద్ధిని అడ్డుకుంటూ..మరో వైపు ప్రభుత్వంపై దుష్ప్రచారం
- ఆయా సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే రామిరెడ్డి విజ్ఞప్తి



కలెక్టర్ హరినారాయన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: నియోజకవర్గంలో టీడీపీ నేతల దాష్టీకం తారాస్థాయికి చేరిందని, ఆ పార్టీ నేతలు సృష్టిస్తున్న అడ్డంకులను తొలగించి పేదలకు న్యాయంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కలెక్టర్ హరినారాయణన్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి నియోజకవర్గంలో టీడీపీ సృష్టిస్తున్న అవరోధాలను తెలియజేశారు. దగదర్తి మండలంలో పలు గ్రామాల్లో నిరుపేదలైన 1,500 మందికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆస్తి రూపంలో ఇస్తున్న ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు కాకుండా టీడీపీ నాయకులు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని వివరించారు. మండలంలోని శ్రీరామపురంలో 180 మందికి, తడకలూరులో 200, చవటపుత్తేడులో 100, చెన్నూరులో 150, దుండిగంలో 100, బోడగుడిపాడులో 150, కాట్రాయపాడులో 280, ఉలవపాళ్లలో 90, దగదర్తిలో 180 మందికి ఇంటి స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లను సిద్ధం చేయగా టీడీపీ నాయకులు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ప్రభుత్వ పరంగా ఎటువంటి ఆస్తులు దక్కకూడదనే కడుపు మంటతో ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. టీడీపీ నాయకుల కుట్రలతో పేదలకు అన్యాయం జరగకుండా కోర్టు కేసుల్లో ఉన్న భూములను మినహాయించి ప్రత్యామ్నాయ భూముల్లో ఇంటి స్థలాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

తుమ్మలపెంటరోడ్డు నిర్మాణానికి అడ్డంకి

కావలి–తుమ్మలపెంట రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించి నూతనంగా నిర్మించడానికి ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసిందన్నారు. అయితే కాంట్రాక్ట్ పొందిన వ్యక్తి టీడీపీ కావడంతో ఆయనతో రోడ్డు నిర్మాణ పనులు జరగకుండా రకరకాల కొర్రీలు వేసి ఆర్‌అండ్‌బీ అధికారులను ముప్పుతిప్పలు పెట్టిస్తూ సంవత్సరాలు గడిపేశారన్నారు. ప్రధానమైన ఈ రోడ్డు దారుణంగా ఉండడంతో ప్రజలు ఎమ్మెల్యేగా తనను, ప్రభుత్వాధినేత అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిందిస్తున్నారన్నారు. టీడీపీ నేతల అడ్డంకి కారణంగా ఆగిపోయిన తుమ్మలపెంట రోడ్డు నిర్మాణానికి ప్రత్యామ్నాయ చర్యలతో పూర్తి చేసే విధంగా చూడాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వెంట దగదర్తి ఎంపీపీ ప్రసాద్ నాయుడు, నాయకులు ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం



జగనన్న సంక్షేమ బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి

అల్లూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వం నడుస్తోందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని అల్లిమడుగు కాలనీ, పేటసత్రంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరిగి స్థానికులను ఆప్యాయంగా పలకరించారు. నలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేకూర్చిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ల వంటివన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను నేరుగా ఇంటి వద్దకే చేరుస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రంలో నవరత్న పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవశకానికి నాంది పలికారన్నారు. టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలు పొందాలంటే రాజకీయ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు ఒక్క రూపాయి అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమవుతుందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలతో పాటు చెప్పని ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజాప్రతినిధులు గ్రామస్థాయిలో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఫణికుమార్, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, మేడా కృష్ణారెడ్డి, దైవాదీనం, ఊటు శ్రీకాంత్ రెడ్డి, సాధక్‌రెడ్డి, మేడా శ్రీనివాసులరెడ్డి, మేడా పాండురంగా రెడ్డి, గోళ్ల రాజేష్, బత్తల గోపాల్, నిమ్మల భాస్కర్, సుధ, రసూల్, పోలయ్య, శ్రీను, జంషీర్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా అధికారి తనిఖీలు



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎంవీఐ

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజాతో పాటు మర్రిపాడు పోలీసుస్టేషన్ సమీపంలో 67వ నంబరు జాతీయ రహదారిపై ఆత్మకూరు ఉప రవాణా శాఖ అధికారి రాములు వాహన తనిఖీలు నిర్వహించారు. కసుమూరు నుంచి ప్రొద్దుటూరు, పీలేరు వైపు యాత్రికులతో వెళ్తున్న రెండు వాహనాల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యం మత్తులో ఉండడంతో ఆ వాహనాలను సీజ్ చేశారు. లారీలోని యాత్రికులను ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించి పంపించారు.

మాలేపాటి, కావ్య ఆధిపత్యం ప్రదర్శన

- కావలిలో లోకేశ్ యాత్ర ఎంటీ
- బాణసంచా కాల్పుల్లో అపశృతి
- ఆకాశ చువ్వ తగిలి వ్యక్తికి గాయాలు



కావలి/అల్లూరు: లోకేశ్ యువగళం కావలిలో ఎంట్రీతోనే రచ్చరచ్చ, అపశృతులు చోటుచేసుకున్నాయి. శుక్రవారం రాత్రి 8.30 గంటలకు అల్లూరు మండలం శివారులోని పైడేరు కాలువ వద్ద అడుగు పెట్టింది. కావలి నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం పోటీపడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు, కావ్య కృష్ణారెడ్డి లోకేశ్ సమక్షంలోనే తమ బలాబాలాలు ప్రదర్శించుకున్నారు. 10.20 గంటలకు అల్లూరులో ఏర్పాటు చేసిన బస కేంద్రానికి లోకేశ్ చేరుకున్నారు. లోకేశ్‌కు స్వాగతం చెప్పడానికి వెళ్తున్న టీడీపీ నాయకులు బాణసంచా కాల్చగా, ఒక తారా చువ్వ పుల్ల కిందకి పడుతూ బజారులో దుకాణం వద్ద టీ తాగుతున్న ఒక వ్యక్తిపై పడింది. అతని తలకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతో స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. అయితే అతని గురించి టీడీపీ శ్రేణులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. లోకేశ్ ఎంట్రీ అయిన 10 నిమిషాలకే గాలి, వాన రావడంతో అల్లూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కొన్ని నేలకు ఒరిగాయి. మరికొన్ని చినిగిపోయాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల రీత్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేసన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

దుత్తలూరు: దుత్తలూరు, నర్రవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని డిస్కం ఏఈ వెంకటసుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా వినియోగదారులు గమనించాలని కోరారు.

నేటి నుంచి సమీక్ష సమావేశాలు

చేజర్ల: మండలంలో ఇటీవల ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్ష సమావేశాలు జరుగుతాయని ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న నెర్నూరు, 11న ఏటూరు, 13న తూర్పుపల్లి, 15న పాతపాడు, 18న కోటితీర్థం, 20న పెరుమాళ్లపాడు, 22న వావిలేరులో జరుగునని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే ఈ సమావేశాలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం దేవరాయపల్లి బిట్-1 సచివాలయ పరిధిలో 8, 9 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేపట్టే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

సంక్షేమ రాజ్యం జగనన్నతోనే సాధ్యం



లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన లబ్ధి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఉదయగిరి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జమ్మలపాళెంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామంలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు బొట్టు పెట్టి హారతులిచ్చారు. ముందుగా రాజగోపాల్‌రెడ్డి స్థానిక బస్టాండ్ సెంటర్‌లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలేరమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వృద్ధులు, మహిళలు, రైతులతో ఆప్యాయంగా మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా, జగనన్న విద్యా దీవెన, సున్నావడ్డీ, నేతన్న నేస్తం, పింఛన్ తదితర పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో క్షుణ్ణంగా వివరించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పనులు చేసే ప్రభుత్వం, పేదవారి కష్టాలు తీర్చే ప్రభుత్వం జగన్ ప్రభుత్వం అన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు ద్వారా ముఖ్యమంత్రి గ్రామ స్వరాజ్యానికి సరైన భాష్యం చెప్పారన్నారు. ప్రస్తుతం జగనన్న సురక్ష ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చేవూరు జనార్దన్ రెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఎంపీడీఓ శ్రీధర్‌బాబు, తహసీల్దార్ పద్మావతి, జమ్మలపాళెం సర్పంచ్ బుర్రి శ్రీవేణి, నాయకులు రావి ప్రసాద్, గుర్రం జగ్గయ్య, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, తిప్పారెడ్డి ఇందిరమ్మ, ఎస్వీ శేషారెడ్డి, కొర్శిపాటి రామిరెడ్డి, బోడిమండ్ల కృష్ణారెడ్డి, తమ్మినేని సతీష్, వేలమూరి శ్రీధర్‌రెడ్డి, పులిం బాబుల్ రెడ్డి, పులి మాల్యాద్రి, వట్టికాల బాలయ్య, కాకాని మహదేవ, వర్ధినేని మురళీ తదితరులు పాల్గొన్నారు.

సప్లయ్ చానల్ అభివృద్ధికి ప్రతిపాదనలు



చాకలికొండ సప్లయ్ చానల్‌ను పరిశీలిస్తున్న డీఈ రమణరావు

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని చాకలికొండ చెరువుకు పిల్లాపేరు నుంచి ఉన్న సప్లయ్ చానల్ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఇరిగేషన్ డీఈ పి.రమణరావు తెలిపారు. కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాలతో ఆయన శుక్రవారం సప్లయ్ చానల్‌ను పరిశీలించి స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు నేతలు సప్లయ్ చానల్ మొదట్లో కి.మీ. మేర పూడిక ఉన్నందున నీరు సక్రమంగా చెరువుకు సరఫరా కావడం లేదని తెలిపారు. నీరు వచ్చేందుకు ఏర్పాటు చేసిన వాల్వ్ ఎత్తు పెంచాలని డీఈకి విన్నవించారు. అయితే వాల్వ్ ఎత్తు పెంచేందుకు సాంకేతికంగా ఇబ్బందులున్నాయని, సప్లయ్ చానల్ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం అధికారులకు నివేదిక పంపుతామన్నారు. నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేసి చెరువుకు నీరు సాఫీగా సరఫరా అయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మండలంలోని జనార్దనపురం ఎస్సీల పొలాలకు నీరు సరఫరా చేసే స్కీంను పరిశీలించారు. కొన్నేళ్ల నుంచి ఈ స్కీం మూతపడిందని, దీంతో పొలాలు బీడుగా ఉన్నాయని రైతులు డీఈకి తెలిపారు. మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు అధికారులకు ప్రతిపాదనలు పంపుతామని డీఈ వారికి చెప్పారు. డీఈతో పాటు విశ్రాంత ఏఈ రామబ్రహ్మం, ఎంపీటీసీ వంశీ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు డబ్బుగుంట రమణయ్య, జనార్దనపురం సర్పంచ్ ఉన్నారు.


నేటి నుంచి మున్సిపల్ బస్టాండ్‌లోకి బస్సులు



బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: పట్టణ నడిబొడ్డున ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఏడీఎఫ్ సహకారం, సొంత నిధులతో నూతనంగా ఆధునికీకరించిన బస్టాండ్‌కు శనివారం నుంచి బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, ఎస్సై కె.ముత్యాలరావు బస్టాండ్ ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. ఆటోలను, తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు నిర్వహించే వారిని క్రమపద్ధతిలో ఏర్పాటు చేసుకునేలా సూచించారు. బస్సులు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ అవాంతరాలు ఎదురవ్వకుండా ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పోలీసులను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్సై ముత్యాలరావు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతిని పురస్కరించుకుని బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తొలుత శనివారం బస్టాండ్ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించనున్నారు. అనంతరం నూతన బస్టాండ్‌లోకి బస్సులను జెండా ఊపి ప్రారంభించనున్నారు. అనంతరం వైఎస్సార్ జయంతి సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పార్టీ నాయకులు తెలిపారు.

పార్టీ విజయానికి కృషి చేయండి



రాజారెడ్డితో దుత్తలూరు నాయకులు

దుత్తలూరు: ప్రతి ఒక్కరు పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని ఉదయగిరి సమన్వకర్త మేకపాటి రాజారెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి బ్రాహ్మణపల్లిలోని ఆయన నివాసంలో మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ దుత్తలూరు పార్టీ బాధ్యతలను దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి పర్యవేక్షిస్తారని తెలిపారు. త్వరలో పార్టీ అధిష్టాన నిర్ణయం ప్రకారం నియమకాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌పీ కొండారెడ్డి, దొంతిరెడ్డి జయసింహారెడ్డి, వెంకటేశ్వర్లు, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేవరపాటి సురేంద్రరెడ్డి, రామిరెడ్డి విజయ్, మండ్ల శివ, యనమల వెంగయ్య, అన్నంరెడ్డి వెంకటేశ్వర్లు,అశోక్ పాల్గొన్నారు.